# ఎమ్మెస్ ప్రసాద్

# అన్ ఫినిష్‌డ్!



ప్రముఖ హిందీ సినిమా దర్శకుడు సుజిత్‌కపూర్ తన ఊహలను తెరమీద కెక్కించడంలో ప్రసిద్ధుడు. కానీ ఆ రోజు మాత్రం ప్రత్యక్షంగా ఆయన అరగంటసేపు చెప్పినా నాకు బోధపడినది చాలా తక్కువ. అందుకే అడిగేశాను...

"ఇంతకీ మీ బాధ ఏమిటి? మీ ఆవిడ ఫినిష్ కావాలనా? సినిమా ఫినిష్ కావాలనా?"

బాగా తాగి ఉన్నాడేమో, బుర్రకు పనిచెప్పే నా ప్రశ్న అతనికి కోపం తెప్పించింది. "ఏడిసినట్టుంది! ఆవిడ ఫినిషయితే సినిమా ఫినిష్ ఎలా అవుతుంది? ఆవిడే కదా హీరోయిన్!" అని అరిచాడు.

"మరి ఆవిణ్ణి చంపమని మనిషిని నియమించారంటున్నారు?"

"అవును మరి. అది హీరోగాణ్ణి మరిగితే చూస్తూ ఊరుకోవాలా?"

"మళ్లీ ఆమె చావకూడదనుకుంటున్నారు!?"

"అవును మరి. సినిమా పూర్తవకపోతే స్టూడియోవాళ్లు నా పీక పిసికేస్తారు. నా కెరీర్ సర్వనాశనం అయిపోతుంది."

"మరి అయితే చంపవద్దని ఆ మనిషికి చెప్పేయవచ్చుగా!"

"వాడెవడో తెలిసి ఛస్తేగా? తెలిస్తే నీలాంటి ప్రైవేటు డిటెక్టివ్‌ని పెట్టుకోవడం ఎందుకు?" అంటూ గొంతు చించుకుంటున్నాడు కపూర్.

"మీరు పబ్లిగ్గా అంతలా అరిస్తే నేను ప్రైవేటు డిటెక్టివ్‌ని కాదు, పబ్లిక్ డిటెక్టివ్ నవుతాను. మీకెందుకూ పనికిరాకుండా పోతాను!" నెమ్మదిగా చెప్పాను.

తనమీద తనకే కోపం వచ్చింది కపూర్‌కి. బాటిల్ ఎత్తి గడగడా మళ్లీ తాగాడు.

ఇంకో అరగంట సంభాషణ తర్వాత అసలు సమస్య అర్థమయింది నాకు. కపూర్ కెరీర్ ప్రస్తుతం చాలా క్రిటికల్‌గా ఉంది. గతంలో ఎంతో పేరు తెచ్చుకున్నా, ప్రస్తుతం చేతిలో ఉన్నది 'సుల్తానా' అనే ఈ బిగ్ బడ్జెట్ సినిమా ఒక్కటే. మహారాజ స్టూడియో వాళ్లు పెట్టుబడి పెడుతున్నారు కానీ రెండేళ్లయినా సినిమా ముందుకు సాగకపోవడంతో చాలా చికాకు పడుతున్నారు. సుల్తానా పాత్రకు కపూర్ ఎంచుకున్నది షీలా అనే ప్రఖ్యాత నటీమణిని. చిక్కేమిటంటే షీలా, కపూర్ భార్య కావడం. అంతకన్నా చిక్కేమిటంటే హీరోగా సెలక్టయిన కొత్త నటుడు సుకుమార్ సిన్హాపై షీలా మనసుపడటం.

"ఇలాంటివి సినీ రంగంలో సామాన్యమే అంటారు కదా! ఆ మాటకొస్తే మీపై కూడా... " అంటూ నచ్చచెప్పబోయాను కపూర్‌కి.

"నేనూ పత్తిత్తునని చెప్పటంలేదు. ఇప్పుడంటే వయసు మళ్లి, జోరు తగ్గింది కానీ, నా టైములో, టాప్ డైరెక్టరుగా ఉండే రోజుల్లో నేను రుచి చూడని హీరోయిన్ లేదు. అందువల్ల షీలా... ఆ విషయం గురించి కాదు, మాంసం తింటున్నాం కదాని ఎముకలు మెళ్లో వేసుకుని తిరగనక్కరలేదు. షీలాకు ఆ లిమిట్ తెలియదు, బొత్తిగా టైల్ బాయ్ క్కూడా తెలిసేట్టు, సెట్లోనే... దిసీజ్ టూ మచ్, ఐ సే... ఆ సుకుమార్‌గాడు... రాస్కెల్... నేను సెలెక్ట్ చేసినవాడు నన్ను కుకోల్డ్ చేసి నాకు పోజు కొడతాడా?" ఆవేశపడ్డాడు కపూర్.

అనామకురాలిగా ఉన్న షీలాను వెలికిదీసి, పెద్ద హీరోయిన్‌ను చేసి పెళ్లాడిన కపూర్‌కి ఆమె తెరవెనుక వేసే వేషాలు కోపం తెప్పించడంలో ఆశ్చర్యం లేదు. అందుకే మద్రాసులో దిగగానే ఆవేళ రాత్రి బార్లో కలిసిన అరవ గూండాతో ఒప్పందం చెసుకున్నాడు, 50 వేలకు తన భార్యను చంపించివేయడానికి.

"వాడు గూండా అనీ, చంపడానికి వెరవడనీ మీకెలా తెలుసు? ఎవరు ఇంట్రడ్యూస్ చేశారు?" అని అడిగాను.

"ఎవరూ చేయలేదు. అండమాన్స్‌లో షూటింగ్ పెట్టుకున్నాం. షీలాకి విమానం ఎక్కడం అంటే భయం. మద్రాసు వచ్చి ఓడెక్కుదామంది. సరే అని అందరం వచ్చాం. మద్రాసులో దిగిన సాయంత్రమే ఓ చిన్న డిస్కో క్లబ్బులో తాగడానికి వెళ్లాను. అక్కడైతేనే తాగడానికి మజాగా ఉంటుంది. అక్కడ తగిలాడు వీడు. 'పెళ్లాం ఇంకోడితో తిరుగుతూంటే కలిగే బాధ ఎంత తాగితే మాత్రం పోతుందా?' అంటూ కామెంటు చేశాడు."

"వాడికి మీ సంగతి, మీ భార్య సంగతి ఎలా తెలుసు?"

"సెలెబ్రటీలం కదా, అన్ని విషయాలూ బయటపడుతూనే ఉంటాయి. నన్ను గుర్తుపట్టడంతోనే ఆఫర్ ఇచ్చాడు. '50 వేలియ్యి, నీ భార్యను చంపేస్తా! ఓడమీద ప్రయాణికుడిలాగానో, పనివాడిలాగానో వస్తా. సమయం చూసి చంపిపారేసి సముద్రంలోకి తోసేస్తా. మోటివ్ ఏమిటో ఎవడూ ఊహించలేడు కాబట్టి నన్ను ఎవడూ అనుమానించడు!" అన్నాడు.

"ఐడియా కరెక్టే. మీ ఇద్దరి మధ్యా ఒప్పందం కుదిరిన సంగతి ఎవరికీ తెలియదు కదా!"

"అదే అన్నాడు 'ఇప్పుడు పాతికవేలియ్యి. మళ్లీ మనం మాట్లాడుకోవద్దు. మీ ఆవిణ్ణి చంపిన పది రోజులకు వస్తా. అప్పుడు తక్కిన డబ్బియ్యి. అలా అయితే ఇద్దరం సేఫ్!' అన్నాడు. నిజమేననిపించి రొక్కాన జేబులో ఉన్న పాతిక వేలు ఇచ్చేశా. పుచ్చుకుని మాయం అయిపోయాడు!" అన్నాడు కపూర్.

ఆ క్షణంలో భార్యమీద కసికొద్దీ ఎడ్వాన్స్ ఇచ్చేసినా, ఆ తర్వాత మత్తు దిగాక, అతనికి గుర్తుకువచ్చింది భార్య ఛస్తే సినిమా ఆగిపోతుందని. దాంతో భయం పట్టుకుంది. ఎక్కడ ఆ గూండావాడు అనవసరంగా భార్యను చంపేస్తాడేమోనని. వాడిని కలిసి, డబ్బు పోతే పోయింది కానీ నువ్వు ఊరుకో అని చెపుదామంటే వాడి మొహం మర్చిపోయాడు. పేరు ముందే తెలియదు. అందుకే నా వద్దకు వచ్చాడు, ఓ మద్రాసు ప్రొడ్యూసర్ ద్వారా. 'సుబ్రమణి సీనియర్ డిటెక్టివ్, ఏ కేసునైనా ఇట్టే పరిష్కరించగలడు' అంటూ నా గురించి గొప్పగా చెప్పి వెళ్లిపోయాడతను.


"మీరు ఓడ ఎక్కేది రేపే కదా, అక్కడున్న వాళ్లందరి ముఖాలూ పరకాయించి చూడండి. మీతో బేరం కుదుర్చుకున్న వాడెవడో తెలుస్తాడు. ఎగ్రిమెంటు క్యాన్సిల్ అని చెప్పేయండి!" అని సలహా ఇచ్చాను.

"ఈ అరవవాళ్లందరూ నా కంటికి ఒక్కలాగే కనబడతారు. అందరూ తుమ్మమొద్దుల్లా, పోతపోసిన కంచు విగ్రహాల్లా ... అబ్బే, గుర్తుపట్టడం కష్టం. అవాల్టి వాడు కూడా ... ఐ హోప్ యూ ఆర్ నాట ఎ తమిళియన్!" సడెన్‌గా ఆగాడు కపూర్.


నేను చిరునవ్వు నవ్వాను. "తెలుగువాణ్ణిలెండి. అయినా మాకూ మీ పంజాబీలందరూ, ముఖ్యంగా

## మళ్లీ ఆ సినిమాల్లోకే!

తొలినుంచీ ఆక్షన్ చిత్రాల్లోనే చేసిచేసి విసుగెత్తిపోయిన బాలీవుడ్ హీరో సునీల్‌శెట్టి ఇక ఆ ఢిషుం ఢిషుం చిత్రాలు తగ్గించి ఫ్యామిలీచిత్రం ఏదైనా చేద్దామని అనుకున్నాడు. అందుకని ప్రముఖరచయిత గుల్జార్ దర్శకత్వం వహించిన 'హూ తూ తూ'లో తబ్బూతో కలిసి నటించాడు. దానిమీద ఎన్నెన్నో ఆశలుకూడా పెట్టుకున్నాడు. కానీ చివరికి అది కాస్తా బాక్సాఫీసు దగ్గర ఘోరంగా దెబ్బతిని కూచుంది. దాంతో ఇక చాలా డిప్రెషన్‌లో పడిపోయి "హా! ఇహానింతేలే!" అనుకుని మళ్లీ 'రిఫ్యూజీ' చిత్రంలో తుపాకి చేతబట్టాట్ట. అయినా తొలుత ఏర్పడిన ఇమేజ్‌ను అంత త్వరగా చెరిపేసుకోవాలంటే కుదురుతుందేమిటి?



ఎన్.




సర్దార్జీలందరూ ఒక్కలాగే కనబడతారు. మీలాంటి సమస్యే నాకు సర్దార్జీలతో వస్తే మీలాగే నేను అవస్థపడేవాణ్ణి!"

"దట్స్ రైట్! యు గాట్ మై పాయింట్! అందుకని మీరు మాతోబాటు ఓడెక్కండి. నాకు వాడు కనబడితే, నేను గుర్తుపట్టగలిగితే ఇబ్బందే లేదు, నాకు నమ్మకం లేదనుకోండి ఎందుకంటే వాడు టిపికల్ తమిళియన్ అనిపించుకునేందుకన్నట్టు ఎత్తుగా, నల్లగా, తారుడబ్బాలా వేషం వేసుకుని, గళ్లలుంగీ కట్టుకుని వచ్చాడు నేను గుర్తుపట్టలేకపోయినా, ఓడమీద ప్రయాణించేటంతకాలం మీరు షీలాను వెన్నంటి ఉండి ప్రాణాలు కాపాడాలి. సినిమా పూర్తయిన తర్వాత అది ఎలా చచ్చినా, ఎవడితో పోయినా ఐ డోంట్ కేర్!"

ఓడమీదనే పరిచయం అయినట్టు మేం ఇద్దరం నటించినా, హీరో సుకుమార్ సిన్హాకు అనుమానం రానేవచ్చింది. మొదటిరోజు సాయంత్రమే. ఆ అరవగూండా ఓడమీద ఎక్కడా కనబడినట్టు లేదని కపూర్ చెప్పి వెళ్లాక, రెయిలింగ్ వద్ద నిలబడి ఉండగా నన్ను పట్టుకున్నాడు. "మీరెవరో నిజం చెప్పండి. మీరు వ్యాపారస్తులంటే నమ్మకం కలగటంలేదు. ఓడలో అందరినీ పరీక్షగా చూస్తున్నారు, మా యూనిట్‌వాళ్లతో మాట్లాడుతున్నారు!" అని అడిగేశాడు కూడా.

సిన్హా గట్టివాడే. మంచి అందంగా, పర్సనాలిటీతో గ్రీకు గాడ్‌లా ఉండటమే కాదు, తెలివైన చక్కటి రచయితట కూడా. సినిమా స్క్రీన్‌ప్లేలు రాయడానికి రంగానికి వచ్చాడు. ఈ సినిమాతో తొలిసారిగా హీరో కాబోతున్నాడు. అతని అందం, తెలివితేటలు, మాట తీరు వీటిలో ఏ ఒక్కటైనా చాలు షీలావంటి టాప్ హీరోయిన్‌ను కూడా బుట్టలో వేసుకోవడానికి.

నేను చెప్పక తప్పదన్నట్టు బిల్డప్ ఇచ్చి చెప్పాను "మీరూహించినది కరెక్టే. నేను మహారాజా స్టూడియోలో ఎక్కౌంట్స్ ఆఫీసరుని. ఈ సినిమా పేరు చెప్పి స్టూడియో మూతపడే స్థితికి వచ్చింది. డైరెక్టరు చూడబోతే తాగి ఎక్కడ పడి ఉంటాడో తెలియదు. హీరోహీరోయిన్ల కేళీ విలాసాలకు ఎక్కడెక్కడి హోటళ్లూ చాలటంలేదు. ప్రొడక్షన్ మేనేజర్లు అండమాన్స్ షూటింగంటారు. ఆస్ట్రేలియా షూటింగంటారు. షెడ్యూల్ ప్రకారం ఏడాదిన్నర క్రితం పూర్తి కావలసిన సినిమా. అసలు ఎప్పటికైనా పూర్తవుతుందో లేదో స్టడీ చేయమని నన్ను పంపారు. దాన్నిబట్టి సినిమా కంటిన్యూ చేయడమో, మానడమో తేలిపోతుంది."

సుకుమార్ తల దించుకున్నాడు. "మా ఇద్దరి వ్యవహారం అందరికీ తెలియడానికి కారణం షీలాయే. విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంది. నాతోనేకాదు, ఇంతకుముందు సినిమాల్లోని హీరోలతో కూడా ఇలాగే తిరిగేదట. కానీ సినిమా ఆలస్యం కావడానికి నా తప్పేమీ లేదని మీరు గ్రహించాలి. నిజానికి ఈ సినిమా ఎప్పుడు తయారై విడుదలవుతుందాని ఆశగా ఎదురు చూస్తున్నాను. నా కెరీర్ అంతా దీనిమీదే ఆధారపడి ఉంది!" అన్నాడు మెల్లగా.

"మరి కెరీర్ మీద అంత ధ్యాస ఉన్నవాడివి షీలాతో సంబంధం ఎందుకు పెట్టుకున్నావ్? నీ వల్ల మా అందరి ఉద్యోగాలకు ముప్పు వచ్చేట్టుంది!" అన్నాను విసుగ్గా.

"సార్, మీరో విషయం గుర్తించాలి. షీలాకి మదపిచ్చి. నేను కాకపోతే మరొకడు. భర్త ఎలాగూ పనికిరాడు. తనకు మూడ్ లేదన్న కారణంగా ఎన్ని షూటింగ్‌లు క్యాన్సిలయ్యాయో మీరే కనుక్కుని చూడండి. ఆమె డ్రగ్ ఎడిక్ట్. డిప్రెషన్‌లోకి వెళ్లిపోతోందని చెప్పి నెలల తరబడి ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఉంటుంది. అన్నాళ్లూ షూటింగ్ క్యాన్సిల్. నిజానికి నాది ఓ సజెషన్. షీలాను తీసిపారేసి సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్న రోష్‌నీను హీరోయిన్ చేయండి. షీలా మీద తీసిన షాట్లన్ని కనుక? రోష్‌నీతో రీషూట్ చేసినా ఈ డిలే వల్ల జరిగే లాస్ కంటే తక్కువ పడుతుంది!" అంటూ నన్ను కన్విన్స్ చేయబోయాడు.

డిటెక్టివ్ పనిలో కష్టం ఇదే! ఐడెంటిటీ తెలియకూడదని ఏదో అబద్ధం చెబితే, దాన్ని నిలబెట్టుకోడానికి ఇంకో నాలుగు అబద్ధాలు చెప్పవలసి వస్తుంది. నువ్వు చెప్పిన ఐడియా పైవాళ్లతో చెపుతానని, కానీ వింటారని నమ్మకం లేదనీ ఏవేవో కోతలు కోసాను సుకుమార్‌తో.

డిటెక్టివ్ పనిలో ఇంకో రకమైన కష్టాన్ని కూడా ఆ రోజు అనుభవించాను, రాత్రి షీలా రూమ్ బయట కాపలా కాసినప్పుడు. అందరూ వాళ్ల వాళ్ల గదులకి వెళ్లాక సుకుమార్ షీలా గదిలోకి దూరాడు. చెట్టంత మనిషి వాడుండగా ఇంకెవడైనా వచ్చి షీలాపై హత్యాప్రయత్నం చేయడం అసంభవం. అయినా నా డ్యూటీ నాది. జాగ్రత్తకోసం తలుపు సందుల్లోంచి, వెంటిలేటర్ ఊచల్లోంచి చూడడం నా వృత్తి ధర్మం. అలా బెడ్‌రూమ్‌ల్లోకి చూడటం నాకు పరమ అసహ్యం.

పైగా షీలాలాంటి మదపిచ్చి ఆడదాని బెడ్‌రూమ్‌లోకి. బయట చూసినప్పుడే ఆమె విశృంఖలత్వం నాకు కాస్త అర్థమైంది. నాలుగు గోడల మధ్య ఆమె ఎంత బరితెగిస్తుందో ఎవరి ఊహకూ అందదు. సుకుమార్‌గాడు కూడా తక్కువ్వాడు కాదు. షీలాను తప్పించేయండి అంటూ నా దగ్గర పోజు కొడుతూనే, ఆమెను వాడు అనుభవిస్తున్న తీరు వర్ణనాతీతం. అసలే కోతి, పైగా కల్లు తాగింది అన్నట్టు షీలా ... డ్రగ్స్ ప్రభావమేమో, తెగ వాగుతోంది. కళ్లతో చూడటం దుస్సహమైపోవడంతో తలుపుకి చెవి ఆనించి వినడంతో సరిపెట్టుకున్నాను. మన గ్రీక్ గాడ్ సుకుమార్ సిన్హా రతిలో కూడా ఉద్దండుడిలాగానే ఉన్నాడు. గంట గడిచినా గది బయటకు రాలేదు సరికదా, కార్యక్రమం వేరే విధంగా కొనసాగుతున్నట్టు షీలా కేకల వల్ల, చేసే శబ్దాల వల్ల తెలుస్తోంది. అనంగరంగంలో ఏ టెక్నిక్స్ ఉపయోగిస్తున్నాడో కానీ సిన్హా చేతిలో షీలా పరవశమైపోయి, పూర్తిగా మైకంలోకి జారుకుంటోంది. ఆమె అతని చేతివేళ్లను ముద్దాడుతూ వాటి నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ ఉంటే వినడం నా తరం కాలేదు. నన్ను, నా వృత్తిని నిందించుకుంటూ అక్కడనుండి నా గదికి వచ్చేశాను.

వచ్చానన్నమాటే గానీ నిద్రపట్టలేదు, నా

డ్యూటీ విస్మరించి తప్పు చేస్తున్నానన్న ఫీలింగ్ కారణంగా. అరగంట గడిచిందో లేదో ఏవో పెద్ద పెద్ద కేకలు వినబడ్డాయి. ఓడ డెక్ మీదకు పరుగు తీశాను. అక్కడ దృశ్యం చాలా చిత్రంగా ఉంది. చుట్టూ పదిమంది దాకా ఓడ సిబ్బంది. మధ్యలో అప్పుడే పుట్టిన పాపాయిలా, నగ్నంగా షీలా! ఆమె కాలికి కట్టిన తాడుకి ఒక కొసకి పెద్ద తోలు సూట్‌కేసు కట్టబడి ఉంది. చుట్టూ ఉన్న కళాసీలలో ఒకడు చేతులు తిప్పుతూ, చాలా ఎక్సైటెడ్‌గా చెబుతున్నాడు.

అతను డెక్ మీదకు ఏదో పనిమీదకు వచ్చేసరికి, ఒకతను పెట్టి హేండిల్‌కి కట్టిన తాడుని పైనున్న రాడ్‌కి వేస్తున్నాడట. దానిమీదనుండి జారిస్తే పెట్టెతోబాటు షీలా కూడా సముద్రంలో పడిపోయేదిట. పెట్టె బరువు వల్ల షీలా సముద్రం అడుగుకి పోవడమే కాదు, ఈత కొట్టినా పైకి రాగలిగేది కాదు. అది చూసి కళాసీ అరవడంతో ఆ మనిషి పారిపోయాడట. అతని మొహం సరిగ్గా కనబడలేదట. తనని చేతుల్లో ఎత్తుకుని అక్కడకు చేర్చిన మనిషి గురించి షీలా ఏమైనా చెప్పగలదేమో అని చూడబోతే, ఆమె సమాధానం చెప్పే స్థితిలో లేదు. సమాధానం ఏమిటి, అసలు తనపై జరిగిన హత్యాప్రయత్నం గురించి కూడా ఆమెకు అవగాహన కలిగినట్లు తోచలేదు. సుకుమార్ సిన్హాతో రతివల్ల పారవశ్యమో, డ్రగ్స్ మహత్మ్యమో తెలియదు కానీ ఆమె ఇంకా ఏదో పలవరిస్తూనే ఉంది.

సుకుమార్ సిన్హా కూడా డెక్‌పై చేరాడు. అతన్ని చూడాగనే నాకు ఆశ్చర్యం కలిగింది. గళ్ళలుంగీ, లాల్చీలో ఉన్నాడు. పావుగంట క్రితమే అతను షీలా బెడ్‌రూమ్‌లో ఇంకోలా ఉన్నాడంటే నమ్మలేని విధంగా. కపూర్ నా పక్కకు చేరాడు. "ఆ అరవ గూండా తన పని తాను చేసుకుపోతున్నాడులా ఉంది. ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో నాకు తెలియనేలేదు!" అంటూ.

"ఒక్క క్షణం!" అంటూ నేను సుకుమార్‌ని పక్కకు పిలిచాను.

"మీరు షీలా గదిలోంచి బయటకు ఎప్పుడు వచ్చారు, సుకుమార్?" అని అడిగాను.

"మీరెప్పుడు చూశారు?" అంటూ ఎదురు ప్రశ్నిస్తూనే కంగారు పడటం నా దృష్టి దాటిపోలేదు. ఆ కిరాయి హంతకుడు ఇతనికి ఎదురుపడి ఉండవచ్చు, తన పరువు పోతుందని సిన్హా ఆ విషయం దాచవచ్చు.

తడబడుతూనే "నేను చెప్పానుగా, నాకు షీలా మీద పెద్ద ఇంట్రస్టు లేదు, ఆమె బలవంతం చేస్తేనే..." అంటూ అతను సంజాయిషీ చెబుతూండగానే నాకు తట్టింది. షీలా చచ్చిపోతే అందరికంటే ఎక్కువ లాభం కలిగేది ఇతనికేనని. చీకట్లో రాయి విసిరాను.

"అవును, నీ ఇంట్రస్టు రోష్‌నీ మీదే! అంతకంటే ముందు సినిమా మీద. షీలా బతికున్నంతకాలం సినిమా పూర్తవదని నీ భయం. అందుకే ఆమెను అన్ని రకాల మత్తుల్లోనూ ముంచెత్తి డెక్ మీదకు తీసుకెళ్ళి సూట్‌కేసు తగిలించి సముద్రంలోకి తోసేయబోయావు!"

సుకుమార్ చలించలేదు. నాకేసి అదోలా చూసి, "నేను హంతకుడిలా కనబడుతున్నానా?" అన్నాడు తొణక్కుండా.

సమాధానంగా అతనికేసి ఎగాదిగా చూడటంలో అతని గళ్ళలుంగీపై పడింది నా దృష్టి. మెదడులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. కపూర్‌కి కనబడిన అరవగూండా ఇతనేనేమో! "సరిగ్గా చెప్పమంటావా? కిరాయి హంతకుడిలా కనబడుతున్నావు. మొహానికి కాస్త బూట్‌పాలిష్ పూసుకుని, అరవ్వాడిలా నటిస్తూ కపూర్‌తో మసకచీకటి డిస్కోథెక్‌లో బేరాలాడే వాడిలా కనబడుతున్నావు." అనడంతో అతని మొహం వివర్ణమైంది.

"నీ కెలా తెలుసు?" అడిగాడు నోరు పెగల్చుకుంటూ.

"అంతేకాదు, దానికి కారణం కూడా చెప్పనా? నువ్వు షీలాను ఓడమీద ఫినిష్ చేద్దామని ప్లాను వేశావు. ఆమె హఠాత్తుగా కనబడకుండా పోతే కపూర్ గగ్గోలు పెడతాడని తెలుసు. అందుకే ఈ నాటకం ఆడావు. దీనివల్ల తను నియమించిన హంతకుడే ఈ పని చేశాడని అనుకుని కపూర్ తేలుకుట్టిన దొంగలా ఊరుకుంటాడని, ప్రమాదవశాత్తూ పడిపోయి ఉంటుందని పోలీసులకు చెప్తాడని లెక్క వేశావు. కపూర్‌లాంటి తాగుబోతు మారువేషంలో ఉన్న నిన్ను గుర్తుపట్టలేడని కరెక్టుగానే ఊహించావు. ఆఫ్టరాల్, కథలకు ప్లాట్లు రాయడంలో నువ్వు సిద్ధహస్తుడివి!"

నా అంచనా తప్పలేదు. సుకుమార్ సేన్ ఒక్కసారిగా తూలాడు. తల గిర్రున తిరిగినట్టుంది. "నీ మేధాశక్తికి, ఊహాశక్తికి జోహార్లు. అన్నీ కళ్ళతో చూసినట్టు నువ్వు చెప్పినది అంతా కరెక్టే. కానీ మిస్టర్ సుబ్రమణి! యూ డోంట్ హేవ్ ప్రూఫ్ టు బ్యాక్ అప్ యువర్ స్టోరీ! సాక్ష్యాలు ఏమీ లేవు. పోలీసులను ఎలా నమ్మించగలవు?" అన్నాడు రాని చిరునవ్వును బలవంతంగా తెచ్చుకుని.

గట్టివాడే! అదృష్టవశాత్తూ నా బుర్ర సమయానికి పనిచేసింది. "షీలా కాలికి కట్టిన సూట్‌కేసు నీ గదిలో చాలామంది చూశారన్నమాట మర్చిపోతున్నావు, సుకుమార్!" అన్నాను బింకంగా. నా మట్టుకైతే నేను చూడకపోయినా గెస్ చేశాను.

సుకుమార్ నిర్వీణ్ణుడయ్యాడు. తక్షణం డెక్ అంచుకు పరుగెత్తాడు. వెళ్లి ఆపబోయాను. "వాట్ ఆర్ యూ డూయింగ్?" అంటూ.

"నేరస్తుడిగా ఉరికంబం ఎక్కే బదులు, ఇలా పరువుగా చావడం మంచిది. ఏక్సిడెంటు అనుకుని ఊరుకుంటారు. నిజానిజాలు నీ ఒక్కడికే తెలుసు. ఎవరికీ చెప్పక, సెలవు!" అంటూ చటుక్కున సముద్రంలోకి గెంతేశాడు.

సుకుమార్ సిన్హా కథ విషాదాంతంగా ముగిసినా, నాకు మాత్రం కథ సుఖాంతమే అయింది కొత్త హీరోతో ఆర్నెల్లలోనే 'సుల్తానా' పూర్తిచేసిన కపూర్ శతదినోత్సవ సభలో నాకూ ఒక మెమెంటో ఇప్పించడం వల్ల! ■

